సాక్షి మంచిర్యాల

శుక్రవారం ∙ 10 ∙ జనవరి ∙ 2025



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం రామకృష్ణాపూర్‌లో రాష్ట్ర స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. 8లో▸



'ఎల్లంపల్లి'లో మొసళ్లు

ఎల్లంపల్లి ప్రాజెక్టులో మొసళ్ల సంచారం మత్స్యకారులను ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల మత్స్యకారుడి వలకు మొసలి చిక్కింది. దీంతో వేటకు వెళ్లేందుకు జంకుతున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /13.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

కాలభైరవస్వామిని దర్శించుకున్న ఎంపీ



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ

కోటపల్లి/మందమర్రిరూరల్/జైపూర్: కోటపల్లి మండలంలోని పార్‌పల్లి గ్రామంలో కాల భైరవస్వామిని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ గురువారం దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ నిర్వాహకులు ఆయనకు జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానించారు. నాయకులు రాంరెడ్డి, మహేశ్‌తివారి, రాజమల్లగౌడ్, కరుణసాగర్, హిమవంత్‌రెడ్డి, పాడేటి రవి పాల్గొన్నారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో సోషల్ మీడియా వారియర్స్, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ పోటీలను ఎంపీ ప్రారంభించారు. జైపూర్‌లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీని సన్మానించారు. సీనియర్ నాయకుడు అంబల్ల రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, నాయకులు సాగర్‌రావు, రాజబాపురెడ్డి, శీలం వెంకటేశ్, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చినూరి మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల సేవలపై అభిప్రాయ సేకరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

నస్పూర్: పోలీసుల సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసుల సేవలపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణకు ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను ప్రతీ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా పిటిషనర్లు, బాధితులు తమ అభిప్రాయాలను తెలుపడం సులభతరం అవుతుందని అన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కనీసం ఐదు క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ పోస్టర్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ(అడ్మిన్) సి.రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

12న బర్డ్‌వాక్



పక్షులను తిలకిస్తున్న పక్షిప్రేమికులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో ఈ నెల 12న మూడో విడత బర్డ్‌వాక్ నిర్వహించనున్నారు. ఇందుకోసం అటవీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బైసన్‌కుంట, నీల్‌గాయి కుంట సమీపంలో బర్డ్‌వాక్ నిర్వహించనున్నట్లు రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. 11న రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని, 12న ఉదయం బర్డ్‌వాక్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. డివిజన్‌లో డిసెంబర్, జనవరి మాసాల్లో నిర్వహించిన బర్డ్‌వాక్ విజయవంతమైంది. సుదూర ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు, శాస్త్రవేత్తలు, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు హాజరయ్యారు. మొదటి విడతలో 60 పక్షులు, రెండో విడతలో 30 పక్షుల వరకు గుర్తించారు. ఈసారి నిర్వహించే బర్డ్‌వాక్‌కు అధిక సంఖ్యలో హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు హాజరయ్యే అవకాశం ఉంది.

జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈ నెల 7నుంచి 9వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో మంచిర్యాల విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. కోటపల్లి మండలం అన్నారం పాఠశాల విద్యార్థి శ్రావణ్‌కుమార్ ఆటోమెటిక్ అప్‌డేట్ టాయిలెట్ క్లీనింగ్ సిస్టమ్ ప్రాజెక్టు ప్రదర్శించాడు. రాష్ట్రీయ బాలవైజ్ఞానిక ప్రదర్శనలో ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో డీపీ ఓరియంట్ జ్ఞాన మందిర్ స్కూల్ దేవాపూర్‌కు చెందిన సాయి శోభిత్ వాయిస్ కంట్రోల్ అసిస్టెంట్ ప్రాజెక్టు ప్రదర్శించాడు. వీరిద్దరూ గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారని డీఎస్‌వో మధుబాబు తెలిపారు. విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సురేందర్‌లను డీఈవో యాదయ్య అభినందించారు.

'ముక్కోటి'కి ముస్తాబు



మంచిర్యాలలోని రామలింగేశ్వర ఆలయం



గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం



చెన్నూర్‌లోని జగన్నాథాలయం

- నేడు ముక్కోటి ఏకాదశి
- ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్/దండేపల్లి/మందమర్రిరూరల్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంచిర్యాలలోని విశ్వనాథస్వామి ఆలయ ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఉచిత, ప్రత్యేక దర్శనానికి వేర్వేరుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 5.30 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభం కానుందని ఈవో ముక్తార వి తెలిపారు. మంచిర్యాల రామలింగేశ్వర దేవాలయంలో వందేళ్ల తర్వాత ముక్కోటి ఏకాదశి సందర్భంగా నూతనంగా ఉత్తర ద్వారం ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2006లో విరాళాలతో నూతనంగా నిర్మించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించనున్నారు. చెన్నూర్‌లోని జగన్నాథాలయంలో స్వామి వారు ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తారు. రెండో కాశీగా పేరొందిన చెన్నూర్‌లో ఈ ఆలయాన్ని 400 ఏళ్ల క్రితం నిర్మించారు. పూరి జగన్నాథాలయం తర్వాత రెండోదిగా పేరుంది. అక్కడి ఆలయంలో నిర్వహించే విధంగా ఇక్కడా పూజలు చేయడం విశేషం. దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ఆలయ అధికారులు గురువారం ఏర్పాట్లు చేశారు. మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ప్రధాన అర్చకులు అనంతాచార్యులు తెలిపారు.



విశ్వనాథ స్వామి ఆలయంలో ఏర్పాట్లు



మందమర్రిలో..

ఆ దారికి అటవీ చిక్కు!



అటవీ అనుమతులు లేక నిలిచిన ఎన్‌హెచ్–63

- ఎన్‌హెచ్–63 నిర్మాణానికి తీరని కష్టాలు
- బ్లాక్ స్పాట్స్‌లో నిత్యం ప్రమాదాలు
- అటవీ కేసుతో పనుల్లో తీవ్ర జాప్యం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారి–63 నిర్మాణం అటవీ అనుమతుల అడ్డంకితో ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న ఈ రోడ్డు గత ఏడేళ్లుగా అసంపూర్తిగానే నిలిచిపోతోంది. దీంతో వాహనచోదకులు తిప్పలు పడుతున్నారు. జిల్లా కేంద్రం మంచిర్యాల నుంచి చెన్నూర్, సిరోంచా వైపు రాకపోకలకు ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాల రవాణా ఉంటుంది. 2017 నుంచి మొదలైన నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. ఈ రోడ్డు నిజామాబాద్–జగ్దల్‌పూర్‌కు వెళ్లే జాతీయ రహదారి కావడంతో భవిష్యత్‌లో మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉంది. మరోవైపు మంచిర్యాల, నస్పూర్, శ్రీరాంపూర్ పరిధిలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణ కోసం వార్షిక ప్రణాళిక(2021–22)లో ఏడు బ్లాక్ స్పాట్స్‌లో రోడ్డు విస్తరణ, ఆధునీకరణ, భూ సేకరణ కోసం రూ.59.79 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. మంచిర్యాల పట్టణం తోళ్లవాగు నుంచి జైపూర్ మండలం రసూల్‌పల్లి వరకు 9.8కిలోమీటర్ల మేర ఫోర్ లైన్, డివైడర్లు, యూ టర్న్‌లు, సెంట్రల్ లైటింగ్ పనులు చేయాలి. అయితే శ్రీరాంపూర్ శివారు నుంచి ఒక వైపు అటవీ భూమి ఉంది. ఆ సమయంలో నాటి సీఎం కేసీఆర్ పర్యటన ఉందని అధికారులు వేగంగా పనులు పూర్తి చేసేందుకు అనుమతులు లేకుండానే ఇందారం అటవీ బీట్ పరిధిలో రోడ్డు తవ్వారు. దీనిపై అటవీ అధికారులు కేసు నమోదు చేస్తూ యంత్రాలను సీజ్ చేసి జరిమానా విధించారు. అధికారులకు అటవీ భూమి తెలియదని, కేసు తీసేయాలని కోరగా.. అధికారులు కాంట్రాక్టర్‌పై నిబంధనల ప్రకారం కాకుండా నామమాత్రంగా జరిమానా విధించారు. దీనిపైనా అప్పట్లో ఫిర్యాదులు కూడా వెళ్లాయి. అప్పటి నుంచి ఈ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. బ్లాక్‌స్పాట్స్‌లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

దెబ్బతిన్న రోడ్డు

గత ఏడేళ్లుగా నిర్మాణంలోనే ఉన్న ఈ జాతీయ రహదారి ఇప్పటికే చాలాచోట్ల భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతింటోంది. ఇప్పటికే చెన్నూర్, కోటపల్లి పరిధిలో రోడ్డు పనులు పూర్తయ్యాయి. కోటపల్లి నుంచి మొదలు భీమారం, జైపూర్ పరిధిలో చాలా చోట్ల రోడ్డు కుంగిపోతోంది. ఇటీవల భీమారం మండలం జోడువాగుల వద్ద వంతెన నిర్మాణానికి రూ.100 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. టెండర్ సిద్ధమైతే టోల్ వసూలు కోసం టోల్‌ప్లాజా ఏర్పాటుకు త్వరలో టెండర్లు ఆహ్వానించే అవకాశం ఉంది. జోడువాగుల వద్ద వంతెన నిర్మాణానికి డీపీఆర్ సిద్ధమవుతోంది. ఇది ఖరారై పనులు ప్రారంభిస్తేనే ఇక్కట్లు తీరనున్నాయి. ఇరుకు వంతెన, రోడ్డుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటవీ శాఖ కేసు తొలగిపోతేనే బ్లాక్‌స్పాట్స్ చోట నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఇటీవల కేసును తొలగించాలంటూ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు ఎన్‌హెచ్ అధికారులు విన్నవించారు. కేసు పరిష్కారమైతేనే ఈ రోడ్డు పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

పనులు పూర్తి చేస్తాం

ఎన్‌హెచ్–63 పరిధిలో మిగిలిన పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. బ్లాక్ స్పాట్స్‌లో అటవీ కేసు కారణంగా నిలిచిపోయింది. జోడువాగుల వద్ద టెండర్ ఖరారైతే పనులు మొదలవుతాయి. టోల్ వసూళ్ల కోసం కూడా త్వరలో టెండర్ పిలుస్తాం.

– క్రిష్టారెడ్డి ఈఈ, ఎన్‌హెచ్–63(రాష్ట్ర పరిధి)

ఎస్సీ ఉపకార వేతనాలు.. ఈ పాస్

- అందుబాటులోకి కాగిత రహిత సేవలు
- కళాశాలల ప్రిన్సిపాళ్లకు డిజిటల్ కీ
- నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ

మంచిర్యాలఅర్బన్: ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనాల చెల్లింపు సులువు కానుంది. కాగిత రహిత సేవలు అందుబాటులోకి తేవడంతో చెల్లింపుల్లో జాప్యానికి చెక్ పడనుంది. 2024–25 విద్యాసంవత్సరం నుంచి బోధన ఫీజులు, ఉపకార వేతనాలు విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లో జమ కానున్నాయి. ఇందుకోసం శుక్రవారం జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో జిల్లాలోని 75 నర్సింగ్, ఇంజినీరింగ్, డిగ్రీ, ఇంటర్, పాలిటెక్నిక్, పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఐడీ, పాస్‌వర్డ్‌తో కూడిన డిజిటల్ కీ(డోంగల్) అందజేశారు. ఇదివరకు విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయాల్సి వచ్చేది. అక్కడి నుంచి మూడు హార్డ్‌కాపీలను కళాశాలల్లో అందజేస్తే ప్రిన్సిపాల్ పరిశీలన, సంతకం చేసి సంక్షేమ కార్యాలయంలో అప్పగించేవారు. అక్కడి నుంచి ట్రెజరీకి చేరి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే వరకు రోజులు గడుస్తుండేవి. బోధన ఫీజులు కళాశాలల్లో, ఉపకార వేతనాల్లో విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో ఏళ్ల తరబడి జమ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తేవి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఉపకార వేతనాల చెల్లింపు విధానంలో మార్పులు చేయడం ఊరటనిస్తోంది.



డిజిటల్ కీ అందుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్

కాగిత రహిత సేవలు

విద్యార్థుల దరఖాస్తు నుంచి ఉపకార వేతనాలు జమ వరకు కాగిత రహిత సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం ఈ పాస్ వెబ్‌సైట్ అందుబాటులోకి తెచ్చింది. తొలి దశలో డెమోగ్రాఫిక్ మ్యాచింగ్, రెండో దశలో బయోమెట్రిక్ అథెంటికేషన్, మూడో దశలో దరఖాస్తు పూర్తి చేయాలి. కళాశాల లాగిన్‌కు విద్యార్థుల వివరాలు వెళ్తాయి. సెక్షన్ క్లర్క్స్ వెరిఫై చేసిన తర్వాత ప్రిన్సిపాల్ సరిచూసి డిజిటల్ కీ ద్వారా జిల్లా అధికారికి పంపిస్తారు. అక్కడ దరఖాస్తును పరిశీలించిన తర్వాత రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారికి పంపిస్తారు. అక్కడి నుంచి సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా టీఎస్ఎంఎస్‌కు పంపించడంతో డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా విద్యార్థుల ఖాతాల్లో ఉపకార వేతనాలు జమ అవుతాయి. మార్చి 31 వరకు ఎస్సీ ఉపకార వేతనాల గడువు పెంచడంతో విద్యార్థులు దరఖాస్తులను ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా చేయూత అందిస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంటు అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఆర్‌సెటి) ఉట్నూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్, ఆర్‌సెటి సంచాలకులు మహ్మద్ గౌస్, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన్నారం, లక్సెట్టిపేట మండలాల్లో జూట్ బ్యాగులపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ జేడీఎం రాంచందర్, శిక్షకులు శ్రీనివాస్, ఆశన్న, సతీష్, స్వర్ణలత, గురువయ్య పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

వైద్య సిబ్బంది సంఖ్య పెంచేందుకు కృషి


మంచిర్యాలటౌన్: ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల్లో వైద్యులు, సిబ్బంది సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలు, పరిసరాలు పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ.సులేమాన్ పాల్గొన్నారు.

సింగరేణి భవనాల పరిశీలన

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మూసివేతకు గురైన సింగరేణి కంపెనీ భవనాలను కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం పరిశీలించారు. పాఠశాల భవనం, సీఐఎస్ఎఫ్ క్యాంపు కార్యాలయాలను పరిశీలించి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల/కళాశాల తాత్కాలిక ఏర్పాటుకు ఆరా తీశారు. తాండూర్‌లోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. సింగరేణి సీఎండీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినా, విద్యార్థులకు సమస్యలు తలెత్తినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై సౌజన్య, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరుకు సన్నద్ధం

- జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు
- వార్డుల వారీగా ఓటరు జాబితా.. బ్యాలెట్ బాక్సులు సిద్ధం
- చివరి దశకు పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- ఇక మిగిలింది రిజర్వేషన్లు ఖరారు మాత్రమే
- సర్పంచులకు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులు



సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. బ్యాలెట్ విధానంలో ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఏర్పాట్లలో తలమునకలైంది. ఇప్పటికే పంచాయతీ వార్డుల వారీగా ఫొటోలతో కూడిన తుది ఓటరు జాబితాను పంచాయతీల్లోనూ ప్రదర్శించారు. బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయగా.. కొన్నింటిని మహారాష్ట్ర నుంచి తెప్పించారు. జిల్లాలోని 16 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొదటి విడతలో బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్, వేమనపల్లి, రెండో విడతలో భీమారం, చెన్నూర్, జైపూర్, కోటపల్లి, మందమర్రి, మూడో విడతలో దండేపల్లి, హాజీపూర్, జన్నారం, లక్సెట్టిపేట మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 2,730 పోలింగ్ కేంద్రాలు ఎంపిక చేశారు. ఎన్నికల రోజు వరకు పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపుల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సౌకర్యాలతోపాటు మరుగుదొడ్లు తదితర వసతులు, వీల్‌చైర్‌లు అందుబాటులోకి తీసుకు రానున్నారు.

గుర్తులివే..

సర్పంచ్ ఎన్నికలకు బ్యాలెట్ పేపర్ పింక్ కలర్‌లో ఉంటుంది. నోటాతోపాటు మొత్తం 30 గుర్తులు బ్యాలెట్ పేపర్‌లో ముద్రించనున్నారు. 30 కన్నా ఎక్కువ మంది పోటీలో ఉంటే ప్రత్యేకంగా మరో బ్యాలెట్ పేపర్ ముద్రించే అవకాశం ఉంది. సర్పంచ్ అభ్యర్థికి ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీ పర్సు, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, స్పానర్, చెత్త డబ్బా, నల్ల బోర్డు, బెండకాయ, కొబ్బరి తోట, వజ్రం, బకెట్, డోర్, హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, టార్చిలైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, స్టంప్స్ గుర్తులు ఉన్నాయి.

వార్డు సభ్యులకు..

వార్డు సభ్యులుగా పోటీ చేసే 20 మంది వరకు నోటాతో కలిపి మొత్తం 21 గుర్తులు ఉంటాయి. ఇందులో గౌను, గ్యాస్ పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్‌యాంటెనా, గరిట, మూత, ఐస్‌క్రీం, గాజు గ్లాసు, పోస్టు డబ్బా, కవరు, హాకీ కర్రబంతి, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్ స్తంభం, కేటిల్ గుర్తులు ఉంటాయి. బ్యాలెట్ పేపర్ తెల్ల రంగు కాగితంపై ముద్రిస్తారు.

రిజర్వేషన్ల ప్రకటన వస్తే..

2019లో పంచాయతీ ఎన్నికలు జరగగా అప్పుడు పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్ రిజర్వేషన్లు పదేళ్లు కొనసాగుతాయని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల మార్పుతోపాటు బీసీల రిజర్వేషన్లు పెంచేందుకు సన్నాహాలు చేస్తోంది. రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. రొటేషన్ పద్ధతిలో అయితే ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మారుతాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇక రిజర్వేషన్ ప్రకటన వస్తే ఎవరు పోటీలో ఉంటారోనన్న చర్చ జరుగుతోంది.


జిల్లా వివరాలు

మండలాలు	16
గ్రామ పంచాయతీలు	311
వార్డులు	2,730
మహిళా ఓటర్లు	1,94,688
పురుష ఓటర్లు	1,94,039
ఇతర ఓటర్లు	19
మొత్తం ఓటర్లు	3,84,746

బ్యాలెట్ బాక్సులు..

జంబో	1,018
బిగ్	324
మీడియం	1,556
స్మాల్	879
మొత్తం	3,777

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం..



రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే బ్యాలెట్ బాక్స్‌లు అందుబాటులో ఉంచగా వార్డుల వారీగా ఫొటో ఓటరు జాబితా పూర్తి చేశాం. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా కార్యాచరణ పూర్తి చేశాం. పోలింగ్ కేంద్రాలను గుర్తించి జాబితా తయారు చేస్తున్నాం.

– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

వైరస్‌ల నుంచి రక్షణకు మాస్క్ ధరించాలి

- భౌతిక దూరం పాటించాలి
- డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: బ్యాక్టీరియాల ద్వారా వ్యాప్తి చెందే వివిధ రకాల వైరస్‌లు, వ్యాధుల నుంచి రక్షణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న హెచ్ఎంపీవీ వైరస్‌కు సంబంధించి జిల్లాలో ఎలాంటి కేసులు నమోదు కాలేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని తెలిపారు. వైరస్ సోకినట్లయితే దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని, వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటిస్ నిమోనియా వంటి సమస్యలకు దారి తీయవచ్చని తెలిపారు. దగ్గు, తుమ్ముల సమయంలో నోటికి రుమాలు అడ్డుపెట్టుకోవాలని, రద్దీ ప్రదేశాల్లో భౌతిక దూరం పాటించాలని అన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్

జిల్లాలో వైరస్‌లు వస్తే.. చికిత్స అందించేందుకు 1,043 పడకలు ఏర్పాటు చేశామని, ఐసీయూ, వెంటిలేటర్ పడకలు, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించామని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌లు 18 అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులకు సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ సమావేశంలో మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఎపిడమాలజిస్ట్ సుమన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పత్తి చేనులో మృతదేహం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి పంచాయతీలోని కొత్తపల్లి శివారు గల పత్తి చేనులో గుర్తుతెలియని కుళ్లిన మృతదేహం లభ్యమైంది. ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. వేంపల్లికి చెందిన మొగిళి సత్యం కొత్తపల్లి శివారులో పత్తి సాగు చేస్తున్నాడు. గురువారం పత్తిని ఏరేందుకు సమాయత్తం కాగా ఆ చేను నుంచి దుర్వాసన వచ్చింది. పరిసరాలు పరిశీలించగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఎత్తు దాదాపు 5.6 ఫీట్లు ఉండి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి సత్తు ప్రతిభ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫోర్జరీ కేసులో ఒకరి అరెస్టు

దండేపల్లి: ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కొత్తమామిడిపల్లికి చెందిన ఎంబడి సురేందర్ కొందరు రైతుల నుంచి మద్దతుధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేశాడు. ఈనెల 2న జమ్మికుంట మిల్లుకు తరలించేక్రమంలో ఫాం నంబర్ 10లో ప్రత్యేకా ధికారి తహసీల్దార్ సంధ్యారాణి సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. పక్కా సమాచారం మేరకు ఆర్‌ఐ భూమన్న లారీని గూడెం చెక్‌పోస్టు వద్ద పట్టుకుని తనిఖీ చేయగా తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు తేలింది. ఆర్‌ఐ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై వెల్లడించారు.

బీఆర్‌ఎస్ నాయకులపై కేసు

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఇటీవల రోడ్డుపై భైఠాయించి ప్రయాణికులకు ఇబ్బంది కల్గించిన 15 మంది బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. గురువారం నాయకులను అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు.

‘ఎల్లంపల్లి’లో మొసళ్లు

- ప్రాజెక్టులో సంచారం
- ఇటీవల బ్యాక్‌వాటర్‌లో మొసలి పిల్ల
- చేపలవేట వెళ్లేందుకు జంకుతున్న మత్స్యకారులు



రాపల్లి శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో లభించిన మొసలి పిల్ల (ఫైల్)



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లోకి మొసలి పిల్లని వదులుతున్న అటవీ రేంజ్ అధికారి సునీత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో మొసళ్ల కలకలంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో మొసళ్లు జాలర్ల కంట పడుతుండటంతో చేపలు పట్టేందుకు జంకుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఓ మత్స్యకారుడి వలకు మొసలి చిక్కడంతో భయాందోళనకు గురై వదిలిపెట్టాడు. ఆ మొసలి ముళ్లపొదల్లోకి వెళ్లిపోయింది. వలకు చిక్కిన మొసలి ఒకటే అనుకున్న జాలర్లకు ప్రాజెక్ట్‌లో వీటి ఆనవాళ్లు కనిపించాయి. ఇవి మూడు వరకు ఉంటాయని అంటున్నారు. దీంతో చేపలు వేటకు వెళ్లాలంటే మత్స్యకారులు భయపడుతున్నారు. పదుల సంఖ్యలో మొసళ్లు సంచరిస్తున్నాయని వెనకడుగు వేస్తున్నారు. అయితే పగటిపూట చేపల వేటకు వెళ్లినా వచ్చేవరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నామని అంటున్నారు. మరోవైపు ప్రాజెక్ట్‌లోని మత్స్య సంపదను మొసళ్లు తినేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బావుల్లో సర్వసాధారణం

ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపు గ్రామాలకు చెందిన పలు నిర్వాసితులకు సంబంధించి బావులు బ్యాక్ వాటర్‌లో మునిగిపోయాయి. వ్యవసాయ క్షేత్రాలకు చెందిన బావులు ఉన్నాయి. మొత్తం ప్రాజెక్ట్‌లో నిత్యం మొసళ్లు అటూ ఇటూ తిరుగుతూ బావుల్లో ప్రత్యక్షమవుతున్నాయి. గతంలో వ్యవసాయ బావుల్లో పడిన మొసళ్లను అటవీ అధికారుల సహాయంతోబయటకు తీసి ప్రాజెక్ట్‌లోకి తిరిగి వదిలిపెట్టారు.

ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో..

‘ఎల్లంపల్లి’లో ఓ మత్స్యకారుడు చేపలు పట్టేందుకు చేసిన వినూత్న ఆలోచనకు ఏకంగా మొసలి చిక్కింది. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు కునారపు రామయ్య ఇటీవల చేపలు పట్టేందుకు వెదురుతో ఓ బుట్ట తయారు చేసి బ్యాక్‌వాటర్‌లో పెట్టాడు. రెండు రోజుల తర్వాత బుట్ట చూడగా మొసలి పిల్ల చిక్కుకుంది. బుట్టతో సహా మొసలిని రామయ్య ఇంటికి తీసుకువెళ్లాడు. స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని మొసలిని చూసి ఆనందపడ్డారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఆరునెలల మొసలితో ఉన్న బుట్టను ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో వదిలిపెట్టారు.

భయంగా ఉంది



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో పదుల సంఖ్యలో మొసళ్లు ఉన్నాయి. జాలర్లకు మొసళ్లు కనిపించాయి. ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లాలంటే భయంగా ఉంది. అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలి. – బొగ్గుల చంద్రశేఖర్, మత్స్యకారుడు, నంనూర్

పతంగులు ఎగురవేసే వేళ జాగ్రత్త

- చైనామాంజా వాడొద్దు
- స్తంభాలు, తీగల వద్ద గాలిపటాలు ఎగురవేయొద్దు
- బహిరంగ ప్రదేశాల్లో ఎగురవేయాలి



రక్షణ గోడలేని భవనంపై పతంగులు ఎగరేస్తున్న చిన్నారులు

దండేపల్లి: సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ. పల్లెల్లో ఇప్పటి నుంచే పతంగుల సందడి ఊపందుకుంది. దుకాణాల్లో రంగురంగుల పతంగులు విక్రయిస్తున్నారు. దీంతో పాఠశాలకు సెలవు వస్తే చాలు విద్యార్థులు గాలిపటాలు ఎగరేస్తున్నారు. చిన్నా పెద్దలు పతంగులు ఎగురవేయడంపై ఆసక్తి చూపిస్తుంటారు. పతంగులు నింగిలో ఎగురుతుంటే పిల్లల కేరింతలు హోరెత్తుతాయి. పతంగులు కొత్త పుంతలు తొక్కే క్రమంలో చైనా మాంజా దారం వచ్చింది. దీని ద్వారా పక్షులకు, వ్యక్తులకు హాని జరగుతుందనే అటవీశాఖ 2007లో నిషేధించింది. పూర్తిస్థాయి నిషేధం అమలు కాకపోవడంతో అక్కడక్కడ మాంజా దొరకడం, పతంగులకు కట్టి ఎగిరేయడం సాధారణంగా మారింది. పలుచోట్ల పతంగులను ప్రమాదకర ప్రాంతాల్లో ఎగురవేస్తూనే ఉన్నారు. పండుగ వేళల్లో జాగ్రత్తలు పాటించకుంటే విషాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

- శిథిల భవనాలు, రక్షణ గోడలేని భవనాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, నీటి ట్యాంకుల పైకి ఎక్కి పతంగులు ఎగరవేయొద్దు.
- సీసీ దారులు, రహదారులు వద్ద దారం, మాంజా దారం వేలాడుతూ కనిపిస్తే తీసివేయాలి. లేకుంటే వాహనదారులు, పాదాచారులకు తగిలి గాయాలయ్యే పరిస్థితి ఉంది.
- బహిరంగ ప్రదేశాల్లోనే పతంగులు ఎగురవేయాలి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగల దగ్గరగా గాలిపటాలు ఎగురవేయడం ప్రమాదకరం.
- విద్యుత్ తీగల మీద పడిన గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించారు.
- మెటాలిక్ దారాలు వినియోగించడం వల్ల విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది.

చైనామాంజాపై నిషేధం

పంతంగులు ఎగురవేసేటప్పుడు చైనా మాంజాదారాలు వాడొద్దు. వాటితో పక్షులు, మనుషులకు ప్రమాదం పొంచి ఉంది. చైనా మాంజా దారాన్ని అటవీశాఖ నిషేధించింది. దీనిపై ఇప్పటికే కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాం. చైనా మాంజా దారాలు విక్రయిస్తే చర్యలు తప్పవు. – సుష్మరావు, ఎఫ్ఆర్వో, తాళ్లపేట

విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి



మడావి భీంరావ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని దుబ్బగూడలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందాడు. ఎస్సై సునీల్ కథనం ప్రకారం..గుడిహత్నూర్ మండలం దావెన్‌గూడ గ్రామానికి చెందిన మడావి బాదిరావ్, మాద్కుబాయి దంపతులకు చెందిన ఐదుగురు కూతుళ్లు, ఏకైక కుమారుడు మడావి భీంరావ్ ఉన్నాడు. భీంరావ్ (26) డిగ్రీ పూర్తి చేశాడు. వ్యవసాయ పనులకు వెళ్తున్న తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నాడు. ఇంద్రవెల్లి మండలంలోని దుబ్బగూడలో ఉంటున్న తన అక్క యేర్మ సీతాబాయి ఇంటికి రెండు రోజుల క్రితం భీంరావ్ వెళ్లాడు. గురువారం అక్క ఇంట్లో ఉయ్యాల తాడును తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలైన భీంరావ్‌ను బంధువులు అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్‌లో మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి బాదిరావ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాంగ్విలో రైతు..

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన రైతు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం..పంతుల భూమన్న (69) ఎప్పటిలాగే బుధవారం సాయంత్రం తన పంట చేనుకు వెళ్లాడు. నీరు పెట్టేందుకు మోటారు ఆన్‌చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. ఎంతకీ భూమన్న ఇంటికి రాకపోవడంతో బంధువులు చేనుకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య అడెల్లా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



భూమన్న మృతదేహం

కుర్మపల్లి చెరువు వద్ద ఒకరు..

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లి చెరువు వద్ద బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి ఒకరు మృతిచెందాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం బలగల గ్రామానికి చెందిన ఆర్.సురేష్ (35) ఓ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా కుర్మపల్లి చెరువు వద్ద ఓ విద్యుత్ స్తంభం పైకి ఎక్కాడు. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కిందపడిపోయాడు. వెంటనే మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాత్రి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కేస్లాపూర్‌కు చేరిన ప్రచార రథం



మెస్రం వంశీయుల ప్రచార రథం

ఇంద్రవెల్లి: నాగోబా జాతరపై ప్రచారం నిర్వహించేందుకు ఈ నెల 2న కేస్లాపూర్ నుంచి ప్రారంభించిన ప్రచారరథం తిరిగి గ్రామానికి చేరుకుంది. ఇంద్రవెల్లి, సిరికొండ, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లోని మెస్రం వంశీయులున్న గ్రామాలకు ప్రచారం రథం వెళ్లింది. దీని ద్వారా ప్రచారం నిర్వహించిన కటోడ మెస్రం కోసేరావ్, పర్దాన్ మెస్రం దాదారావ్ గురువారం సాయంత్రం కేస్లాపూర్ గ్రామానికి చేరారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి వద్దకు చేరి పవిత్ర గంగాజలం కోసం పాదయాత్ర ప్రారంభిస్తారని నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



కాలుతున్న పత్తి

వాంకిడి: మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్ వద్ద గల ఆర్‌బీ ఇండస్ట్రియల్ జిన్నింగ్ మిల్లులో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి లోడుతో మిల్లుకు వచ్చిన బొలెరో వాహనంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే వాహనాన్ని బయటకు తీసుకెళ్లే క్రమంలో మిల్లులో పత్తి కుప్పలకు మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన కార్మికులు నీళ్లు చల్లి మంటలార్పారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు 10 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైందని సీసీఐ అధికారి పన్నాలాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ మృతి



ఆత్రం మారుతి (ఫైల్)

ఇంద్రవెల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సునీల్ కథనం ప్రకారం .. మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన యేమునబాయి, ఆత్రం మారుతి(25) అక్కాతమ్ముళ్లు. వీరి చిన్నవయసులో తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందారు. అక్కాతమ్ముళ్లు ముత్నూర్‌లోని అమ్మమ్మ వద్ద పెరిగారు. ఉట్నూర్ మండలం సాలేవాడకు చెందిన నైతం మనోహర్‌తో యేమునబాయికు పెళ్లయింది. ముత్నూర్‌లోని జైస్వాల్ నితిన్ వద్ద మారుతి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మారుతి బుధవారం ధర్మసాగర్ గ్రామంలోని ఓ రైతు పత్తిని వాహనంలో లోడ్ చేసి సాయంత్రం మండలంలోని ఐఎఫ్‌పీసీఎల్ జిన్నింగ్ మిల్లుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఏమాయికుంట వద్ద కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న కిరాణా షాపుని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మారుతిని అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు రిమ్స్‌లో మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరు మృతి



శ్రీకాంత్ (ఫైల్)

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన గుర్లె శ్రీకాంత్ (25) బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్సై ఎస్.మధుకర్ కథనం ప్రకారం.. ఈనెల 1న శ్రీకాంత్ బైక్‌పై తన అత్తగారిల్లు అయిన కౌటాల మండలంలోని కన్నెపల్లికి వెళ్తున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గత మూడురోజులుగా జ్వరం రావడంతో అత్తారింట్లో ఉంటున్నాడు. చికిత్స నిమిత్తం బుధవారం రాత్రి కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తన కుమారుడిని అత్తింటివారు దాడి చేసి చంపేశారని, మృతదేహంపై గాయాలు ఉన్నాయని తల్లి నానుబాయి ఫిర్యాదు చేసింది. ఈమేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య భాగ్య, కుమారుడు రాము, కుమార్తె శ్రీదివ్య ఉన్నారు.

భార్యతో గొడవ.. టవరెక్కిన భర్త

ఉట్నూర్‌రూరల్: భార్యతో గొడవపడిన భర్త టవరెక్కి హల్‌చల్ చేశాడు. మండలంలోని బీర్సాయిపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. బీర్సాయిపేటకు చెందిన మంగం తిరుపతి, జ్యోతి భార్యభర్తలు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి తిరుపతి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో భార్యభర్తమధ్య గొడవ జరిగింది. గురువారం బీర్సాయిపేట పంచాయతీ కార్యాలయం సమీపాన ఉన్న టవర్ ఎక్కి తిరుపతి రెండు గంటల పాటు హంగామా చేశాడు. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతనికి నచ్చజెప్పడంతో కిందకు దిగాడు. అనంతరం తిరుపతిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు.

గంజాయి విక్రయించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి విక్రయించిన వ్యక్తికి ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి.రమేశ్ గురువారం తీర్పునిచ్చారు. జైనూర్ సీఐ రమేశ్ కథనం ప్రకారం.. జైనూర్ మండలంలోని గౌరీ గ్రామానికి చెందిన సిడం భరత్ తన వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. 2021 అక్టోబర్ 14న అప్పటి ఎస్సై తిరుపతి తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. భరత్‌ను విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అప్పటి సీఐ హనూక్ కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహన్ సాక్షులను కోర్టులో హాజరుపర్చి నేరం రుజువు చేశారు. ఈమేరకు నిందితుడికి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన ప్రస్తుత ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేశ్, ఎస్సై సాగర్, లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ



ట్విన్‌సిటీస్‌-స్పోర్ట్స్ స్కూల్ మధ్య మ్యాచ్

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- రాష్ట్ర స్థాయి అండర్–13 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

రామకృష్ణాపూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఖేలో ఇండియా తెలంగాణ స్థాయి అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు జరిగే పోటీలకు సౌత్ జోన్ పరిధిలోని ఆయా జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపీ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడాపతాకాల ఆవిష్కరణ అనంతరం వివిధ జిల్లాల జట్లు గౌరవ వందనం సమర్పించాయి. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ గెలుపోటములను లెక్క చేయకుండా అకుంఠిత దీక్షతో సాధన చేస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని అన్నారు. తనకు కూడా చిన్ననాటి నుంచి క్రీడలంటే ఇష్టమని, ఒలింపిక్స్ స్థాయిలో రాణించేలా తెలంగాణ క్రీడాకారులు తయారు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ, మందమర్రి జీఎం దేవేందర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్, సీఐ శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నీలం శ్రీనివాస్‌గౌడ్, గోపతి రాజయ్య, అజీజ్, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఉత్సాహంగా..

అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో తొలిరోజు రెండు లీగ్‌మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో గజ్వేల్ ఫుట్‌బాల్ అకాడమీ సిద్దిపేట జట్టుపై కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో ట్విన్ సిటీస్ హైదరాబాద్ జట్టుపై తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ జట్టు విజయం సాధించింది.

జంగున్‌బుయ్యారి వద్ద ఆదివాసీల పూజలు



పూజలు చేస్తున్న రాంజీగూడ ఆదివాసీలు



గంగస్నానానికి బయల్దేరి వెళ్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: పుష్యమాసం పరస్కరించుకొని ఆదివాసీ గ్రామాల్లో జంగుబాయి, భీమాల్ దేవుడు, పెర్సపేన్ (పెద్ద దేవుడు) పూజలను ఆదివాసీలు నిర్వహిస్తున్నారు. అనంతరం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దేవతలకు గంగస్నానాలు ఆచరించి తమ తమ గ్రామాలకు చేరుకుని పూజలు చేస్తున్నారు. మండలంలోని తుమ్మగూడ పంచాయతీ పరిధిలోని రాంజీగూడ, సిరికొండ మండలం కుంటగూడ, ఆదిలాబాద్ మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన ఆది వాసీలు గురువారం జంగున్‌బుయ్యారి దేవస్థానికి వెళ్లి సంప్రదాయ వాయిద్యాల మధ్య పూజలు చేశా రు. పుష్యమాసం ముగింపు వరకు ఈ పూజలు కొనసాగుతాయని ఆదివాసీలు తెలిపారు. పూజార్లు తొడసం బండు, జుగాదివార్ తదితరులు ఉన్నారు.


బావాపూర్(ఆర్)లో కాకతీయుల ఆనవాళ్లు



బావాపూర్(ఆర్) శివారులో కాకతీయులనాటి గణపతి విగ్రహం

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామ శివారులో కాకతీయ అనంతర కాలానికి సంబంధించిన చారిత్రక ఆనవాళ్లను గుర్తించారు. ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కరిపె రాజ్‌కుమార్ గ్రామ శివారులో గురువారం పర్యటించారు. పలు ఆనవాళ్లను గుర్తించారు. ఈ ప్రాంతంలో అత్యంత అరుదైన ప్రాచీన గణపతి శిల్పాన్ని గుర్తించారు. ఈ శిల్పం లలితాసనం, చతుర్భుజు డు, అంకుశం, గొడ్డలి, దంతం, ఉండ్రాళ్లతో చేతులు, ఉదరంపై నాగబంధం ఉన్నాయని వివరించా రు. వీటి ఆధారంగా ఇవి ముమ్మాటికీ కాకతీయుల అనంతర కాలానికి సంబంధించినవిగా చెప్పవచ్చని తెలిపారు. మరిన్ని ఆనవాళ్లు ఉన్నప్పటికీ గుర్తించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉండే ఖానాపూర్ ప్రాంత అడవుల్లో ప్రాచీన విగ్రహాలు, కట్టడాలు చాలా ఉన్నాయని, వాటిని ఆర్కియాలజి శాఖ వారు వెలికి తీసి నేటి తరానికి తెలియజేయాలని కోరారు.

ఆటోడ్రైవర్ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ సమీపంలో ఈనెల 7న ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురు ప్రాణాలను బలిగొన్న డ్రైవర్ పాలెపు రాకేశ్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బోథ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన పాలెపు రాకేశ్ మంగళవారం తన ఆటోలో గ్రామస్తులను మొక్కులు చెల్లించుకునేందుకు దేగామ పోచమ్మ ఆలయానికి తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో రాకేశ్ అతిగా మద్యం తాగి అతివేగంగా, నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో మూలమలుపు వద్ద బోల్తాపడింది. ఈఘటనలో మహిళ అడెల్లి అక్కడికక్కడే మృతిచెందగా, మైలారపు అరుణ్, అయిల ఆశన్నలు ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. ముగ్గురి మృతికి కారణమైన రాకేశ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో బజార్‌హత్నూర్ ఎస్సై అప్పారావ్, ఏఎస్సై ధరంసింగ్, చంపత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ లారీల అడ్డగింత

జైపూర్: మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు లారీలను రామారావుపేట వాసులు గురువారం అడ్డుకున్నారు. రామారావుపేట నుంచి గోదావరి నది సమీపంలో పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించారు. ఐకే–ఓసీపీ మట్టిని గోదావరి నది సమీపంలో డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్లుగా నిర్మించుకున్న రోడ్డును తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సౌకర్యార్థం ఈ రోడ్డును అలాగే ఉంచాలని కోరారు. కాగా, లారీల అడ్డుకోవడంతో స్థానికులు, అధికారులు మధ్య వాగ్వాదం జరిగింది. ఉన్నతాధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.